క్లుప్తంగా

వివాహిత అదృశ్యం


ఎల్లమ్మ

ఆత్మకూరు : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం మిస్సింగ్ కేసు నమోదు అయ్యింది. పోలీస్‌లు తెలిపిన వివరాలు ప్రకారం. మండలంలోని హౌజుబుజుర్గ గ్రామానికి చెందిన దుప్పటి ఎల్లమ్మ(44) ఈనెల 23వ తేదీన ఉదయం 8గంటలకు ఇంట్లో గొడవపడి వెళ్లిపోయింది. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆచూకి తెలిసిన వారు 8712685225, 8712685252 నంబర్లను సంప్రదించాలని ఈ సందర్భంగా పోలీసులు కోరారు.

నాగుర్ల పరామర్శ

నడికూడ : మండలంలోని నర్సక్కపల్లి గ్రామానికి చెందిన కేశిరెడ్డి సంజీవరెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా బీఆర్‌ఎస్ నాయకుడు నాగుర్ల వెంకటేశ్వర్లు శనివారం పరామర్శించారు. నర్సక్క భౌతికానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామానికి చెందిన కోడెం సరోజన ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ సాంబశివరెడ్డి, ఉపసర్పంచ్ ధర్మారావు, రైతు సంఘం నాయకులు వరికెల కిషన్‌రావు, సంతోష్‌రావు ఉన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కాశిబుగ్గ: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన శివనగర్ రైల్వే స్టేషన్ వెనుక ప్రాంతంలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రేటర్ వరంగల్ 35వ డివిజన్ ప్రాంతానికి చెందిన పూజారి రవి.. పక్షవాతం చికిత్స కోసం ఈనెల 23న ఇంటికి తాళం వేసి తాళం చెవులను తన తమ్ముడు పూజారి భాస్కర్‌కి ఇచ్చి రాజస్థాన్ వెళ్లారు. ఈక్రమంలో రవి ఇంటిలోని మొక్కలకు భాస్కర్ భార్య రోజూ నీళ్లు పోస్తుండేది. పని ఒత్తిడి కారణంగా శుక్రవారం వెళ్లలేదు. శనివారం మొక్కలకు నీళ్లు పోయడానికి వెళ్లగా ఇంటి తలుపు తాళాలు పగలకొట్టి ఉండడాన్ని ఆమె గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. బీరువాలోని 15 తులాల బంగారం, పావు కిలో వెండి, రూ. 45వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు తెలిపారు. సమాచారం అందుకున్న మిల్స్‌కాలనీ సీఐ సురేష్‌కుమార్.. డాగ్ స్కాడ్, క్లూస్ టీమ్‌తో సంఘటన స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. బాధితుడి తమ్ముడు భాస్కర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తివారీ మృతి విచారకరం

హన్మకొండ: ఇండియా – చైనా ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సూరజి తివారీ మృతికి అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు ఇల్లందుల శోభన్‌బాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బిహార్ రాష్ట్రం రోహితాస్‌పూర్ జిల్లా మోసాహెబ్‌పూర్‌కు చెందిన సూరజీ తివారీ (90).. తీవ్ర శ్వాసకోశ వ్యాధితో బాధపడుతూ ఈనెల 16న తుది శ్వాస విడిచారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తివారీ మృతి అత్యంత బాధాకరమని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కాజీపేట రూరల్: రూ.5 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు కాజీపేట 62వ డివిజన్ సోమిడి ఎస్సీకాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద కార్పొరేటర్ రవీందర్ యాదవ్ శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎస్‌పీడీసీ డైరెక్టర్ మెరుగు రాజయ్యయాదవ్, డాక్టర్ శ్రావణ్, దాడబోయిన వీరాస్వామి, మాచర్ల జయాకర్, నీల, బండారి సురేందర్, రవికుమార్, కుమ్మరి స్వామి, తిప్పారపు మల్లేష్, మంద కుమారస్వామి, సాంబరాజు, రావు, నాగరాజు, ప్రసన్నలత, శ్రీను, బైరబోయిన రమేష్, దొంగల కుమార్, శివరాం పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి దోహదం

విద్యారణ్యపురి: సాంస్కృతిక పోటీలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని ప్రముఖ జానపద గేయ రచయిత ఇమ్మడి లక్ష్మణాచారి అన్నారు. హనుమకొండ సామ జగన్మోహన్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాకతీయ హెరిటేజ్ –2024లో భాగంగా క్రీడా సాంస్కృతిక పోటీలు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో జానపద గేయ రచయిత వడ్డెర శ్రీనివాస్‌రెడ్డి, కూచిపూడి నృత్యకారిణి, గిన్నిస్ వరల్డ్ రికార్డు గ్రహీత సిరిమల్ల చంద్రస్మిత, విభాగ్ సంఘటన మంత్రి కుంట హర్షవర్ధన్, ఏబీవీపీ హనుమకొండ జిల్లా కన్వీనర్ ఆరెపల్లి సుజిత్ పాల్గొన్నారు.

బీసీ సంఘం అధ్యక్షుడిగా రవి

ఖిలా వరంగల్: తెలంగాణ బీసీ ప్రజా సంఘం తూర్పు నియోజకవర్గ అధ్యక్షుడిగా శివనగర్‌కు చెందిన నూనె రవి నియమితులయ్యారు. ఈమేరకు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్, రాష్ట్ర ఇన్‌చార్జ్ బండారు దేవేందర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

కాంగ్రెస్ అధ్యక్షురాలికి సన్మానం

కాజీపేట రూరల్: హనుమకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షురాలిగా కాజీపేట సోమిడి ప్రాంతానికి చెందిన దాడబోయిన ప్రియాంక యాదవ్ ఎన్నికయ్యారు. ఈమేరకు ఆమెను 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు శనివారం సన్మానించారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

● ఎంపీపీ సుమలత



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుమలత

ఆత్మకూరు : అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఎంపీపీ మార్క సుమలతరజనీకర్ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్యసమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాపాలన కొనసాగుతోందన్నారు. అధికారులు అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు ఉంటుందన్నారు. మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. అనంతరం వివిధ శాఖల అధికారులు నివేదికలను చదివి వినిపించారు.

బిల్లులు చెల్లించాలని సర్పంచ్‌ల ఆవేదన...

సర్వసభ్యసమావేశానికి హాజరైన సర్పంచ్‌లు బొల్ల నరేష్, మచ్చిక యాదగిరిగౌడ్, వేణు తాము చేసిన పనులకు బిల్లులు రాలేదని, వెంటనే బిల్లులు చెల్లించాలని కోరారు. అభివృద్ధి పనులు నిలుపుదల కాకుండా అప్పులు తీసుకొచ్చి పనులు పూర్తి చేశామన్నారు. అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయని, కానీ బిల్లులు మాత్రం రావడం లేదని వాపోయారు. పెండింగ్ బిల్లులు ఇప్పించాలని సభా దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కక్కెర్ల రాధికరాజు, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి, ఏపీఓ రాజిరెడ్డి, మండల పశువైద్యాధికారి డాక్టర్ ధర్మానాయక్ పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

● కాలిపోయిన రూ.లక్ష నగదు, సామగ్రి


కాలిపోయిన సామగ్రి

పరకాల : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన పరకాల పట్టణంలోని ఆకులవాడలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఆకులవాడకు చెందిన నేరేళ్ల పరశురామ్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి పొరుగూరికి వెళ్లాడు. ఈ క్రమంలో విద్యుత్ షాట్‌సర్క్యూట్ చోటుచేసుకుంది. ఇంటిపై నుంచి పొగలు వ్యాపించడంతో గమనించిన కాలనీవాసులు పక్కనే ఉన్న వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఇంట్లోని ఫ్రిడ్జ్ గ్యాస్‌లీకేజీ అవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. మంటలు ఇరువైపుల ఉన్న గదుల్లోకి రావడంతో తలుపులు ధ్వంసం చేసి గ్యాస్ సిలిండర్లను బయటికి తీసుకొచ్చారు. దీంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఫైరింజన్‌తో మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో పరశురామ్ పిల్లల ఫీజులకు సన్నిహితులు ఇచ్చిన రూ.1లక్ష నగదుతో పాటు మరో లక్ష విలువచేసే ఆస్తి దగ్ధమైందని బాధితులు తెలిపారు. కాగా పరశురామ్ పాత్రికేయుడిగా పనిచేస్తున్నాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పరకాల జర్నలిస్టులు, అతని బంధువులు కోరారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం


ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. పాఠశాల హెచ్ఎంగా మోడెం సాయిచందన్ వ్యవహరించడంతో పాటు విద్యార్థులకు స్వయంగా పాఠాలు బోధించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఒక్కరోజు ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం రాజమల్లయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

559 జీవో అమలులో నిర్లక్ష్యం

శాయంపేట : గొర్రెల, మేకల పచ్చిక కోసం ప్రభుత్వం కేటాయించిన జీవో 559, 1016లను అధికారులు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, వెంటనే జీవోను అమలు చేయాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం మండల నాయకుడు కడారి నర్సయ్య డిమాండ్ చేశారు. మండలంలోని తహరాపూర్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ భూములు, బంజరు భూములు, పోరంబోకు భూములు, చెరువుశిఖం తుమ్మ చెట్లను గొర్రెల, మేకల సహకార సంఘాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు పైబడిన గొర్ల కాపరులకు నెలకు రూ. 5వేల ఫించన్ ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మృతి చెందిన వారికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గొర్ల, మేకల పెంపకం దారుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు గడ్డి రవి, కట్టయ్య, సాంబయ్య, ఐలయ్య పాల్గొన్నారు.

చారిత్రక సంపదను కాపాడుకోవాలి

● పరిశోధకుడు డాక్టర్ రాచర్ల గణపతి


శ్రమదానం చేస్తున్న విద్యార్థులు, గణపతి

దామెర : చారిత్రక వారసత్వ సంపదను కాపాడుకోవాలని చారిత్రక పరిశోధకుడు డాక్టర్ రాచర్ల గణపతి అన్నారు. మండలంలోని ఊరుగొండలో గంప వంశీయులు కట్టించిన మెట్లబావిని నోబ్యాగ్ డే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి శనివారం పరిశీలించి శ్రమదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చారిత్రక ప్రాధాన్యం కలిగిన మెట్ల బావిని 18వ శతాబ్దంలో నిర్మించారని అన్నారు. ఈ నిర్మాణంలో వాడిన రాతి స్తంభాలు 12వ శతాబ్దానికి చెందినవిగా తెలుస్తోందన్నారు. శివాలయం స్తంభాలు ధ్వంసం కాకుండా, అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు మెట్ల బావిని నిర్మించినట్లు ఆనవాళ్లు ఉన్నట్లు తెలిపారు. సప్త సంతానాలలో ఒకరైన గంప వంశస్తులు తమ పూర్వికులకు పుణ్య ప్రాప్తి గురించి ఈ బావిని నిర్మించారని వివరించారు. గ్రామంలోని తురకుల గట్టు, గుడి మీద కంచే ప్రాంతంలో వ్యవసాయ భూమి చదును చేస్తున్న క్రమంలో బయటపడ్డ శివాలయ శిథిల స్తంభాలకు మెట్ల బావిలోని స్తంభాలకు పోలికలున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పైండ్ల శ్రీనివాస్, కందికొండ దామోదర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత


ఐనవోలు : ఆర్థికసాయం అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు


శాయంపేట : బియ్యం అందజేస్తున్న స్నేహితులు

ఐనవోలు : శ్రీమల్లికార్జునస్వామి దేవస్థాన మాజీ చైర్మన్, ప్రస్తుత నందనం సొసైటీ డైరెక్టర్ వడిచర్ల శ్రీనివాస్ మృతి తీరనిలోటని డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు విచారణ వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించారు. నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి చందర్‌రావు, డైరెక్టర్లు మేటి చిరంజీవి, బొమ్మినేని బుచ్చిరెడ్డి, బిర్రు పద్మ, కలకోట ఎలేంద్ర, పూజారి రాంచంద్రయ్య, మారపల్లి ఏశోబు, రాజారపు కుమార్, పల్లకొండ సమ్మయ్య, చింత బాబు, మాదారపు సంపత్‌రావు, సీఈఓ కోతి సంపత్, సర్పంచ్ జన్ను కుమారస్వామి, ఉపసర్పంచ్ అడ్డగూడి సతీష్, మాజీ ఆలయ చైర్మన్ మునిగాల సంపత్‌కుమార్ ఉన్నారు.

గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో..

మండలంలోని యాదవ కాలనీకి చెందిన కత్తుల వెంకటయ్య రెండు సంవత్సరాల నుంచి కాలుకి ఇన్ఫెక్షన్ అవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి నల్లబెల్లి చిన్న రాజు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా పుల్యాల రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ బొల్లెపల్లి మధు నుంచి సేకరించిన రూ. 4వేలను ఆర్థిక సాయంగా అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన వెంకటయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌కు చెందిన నద్దునూరి బుజ్జమ్మ గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులకు ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు శనివారం పరామర్శించారు. అనంతరం రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, నాయినేని శ్రీనివాసరావు, కొయ్యడ రాజు, దండబోయిన నరేష్, పుల్ల రాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన బాసాని సుభద్ర అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందింది. ఆమె కుమారుడు నాగరాజుతో 1997–98లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబానికి చేయూతనిచ్చారు. సుభద్ర చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా క్వింటాల్ బియ్యం అందించారు. రంగు వినోద్‌కుమార్, బాసాని బాలకృష్ణ, శశికాంత్, వెంకటేశ్వర్లు, నవీన్, పైడిమల్ల వేణు, బూర రాజశేఖర్, బత్తుల రవి, మారెపల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఈఓకు సన్మానం



ఏఈఓను సన్మానిస్తున్న ఏడీ

శాయంపేట : మండలంలో ఉత్తమ సేవలు అందించినందుకు ప్రగతిసింగారం క్లస్టర్ ఏఈఓ అహ్మద్‌రజాకు అవార్డు లభించగా రైతు వేదికలో ఏఓ గంగాజమున శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2013 నుంచి వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు చేసిన సేవలను గుర్తించి ఉత్తమ అవార్డుకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు అర్చన, రాకేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

జాతర అభివృద్ధికి కృషి

ఆత్మకూరు : అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ జాతర అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ జాతరలో తన స్వంత నిధులతో ఏర్పాటు చేస్తున్న స్టీల్‌రెయిలింగ్ క్యూలైన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవార్లను దర్శించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జాతర నిర్వహణపై ప్రత్యేక దృష్టి వహిస్తోందన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

పరకాల : శాస్త్రవేత్త థామ్సన్ ఎడ్విన్ బల్బు కనిపెట్టిన దినోత్సవాన్ని పురస్కరించుకొని వెలుగు ఎలక్ట్రిషన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రిషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. థామ్సన్ ఎడ్విన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఆకునూరి రమేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉమర్, ఉపాధ్యక్షుడు రామ్‌చందర్, చందు, రఘు, శివప్రసాద్, సమ్మయ్య, సదానందం, సాంబరెడ్డి, హరీష్, రాజేందర్, మహేందర్ పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడం అదృష్టం


మాట్లాడుతున్న సర్పంచ్ మాధవరెడ్డి

వేలేరు : ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని సర్పంచ్ మాధవరెడ్డి అన్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగుస్తుండటంతో కార్యదర్శి రవి, సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం సర్పంచ్ మాధవరెడ్డి, వార్డు సభ్యులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాలకవర్గాన్ని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్ మాధవరెడ్డి మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల పదవీకాలం చాలా సంతృప్తినిచ్చిందన్నారు. గ్రామాభివృద్ధి కోసం కష్టపడి పనిచేయడంతో ఉత్తమ సర్పంచ్ అవార్డు లభించిందని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో సర్పంచ్‌గా ఎన్నికయ్యానని, గ్రామాభివృద్ధిలో తనవంతుగా పాత్ర పోషించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల రక్షణకు సూచనలు పాటించాలి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సునీల్, తదితరులు

శాయంపేట : మూగజీవాల రక్షణకు పశువైద్యుల సూచనలు పాటించాలని మండల పశువైద్యాధికారి సునీల్ అన్నారు. గొర్ల కాపరుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని జీవాల వైద్యానికి దళారులు డబ్బులు తీసుకొని మందుల పంపిణీ చేస్తున్నారని అన్నారు. మండల కేంద్రంలోని పశువైద్యశాలలో శనివారం గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గొర్రెలు, మేకలకు సీజన్ వారీగా వస్తున్న వివిధ రోగాలకు ప్రభుత్వం నుంచి మందులు ఉచితంగా సరఫరా అవుతాయని, వాటిని వినియోగించుకోవాలని మూగజీవాల యజమానులకు సూచించారు. గొర్లు, మేకలకు వస్తున్న రోగాలపై పశువైద్యాధికారులను సంప్రదించాలని, వారి సూచనలు, సలహాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ మండల నాయకులు కడారి నర్సయ్య, గడ్డి రవి, కట్టయ్య, ఐలయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి


వృద్ధురాలి మృతదేహం


మల్లికార్జున్ (ఫైల్)

వేలేరు : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గుండ్లసాగర్‌లో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వంగ మల్లికార్జున్(42) ఈనెల 25వ తేదీన నర్మెట్ట మండలంలోని గండిరామారం గ్రామంలో ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో మద్దెలగూడెం శివారు కొమ్ముగుట్ట వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొనడంతో మల్లికార్జున్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తుతెలియని వృద్ధురాలు(65)కు తీవ్ర గాయాలు అయ్యాయి. కాగా చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపర్చినట్లు పోలీసులు తెలిపారు. వృద్ధురాలు ఎడమ కాలికి నలుపురంగు దారం ఉందని, ఎవరైనా వృద్ధురాలును గుర్తుపడితే పోలీస్‌స్టేషన్ నంబర్ 8712685225, ఎస్సై నంబర్ 8712685252ను సంప్రదించాలని స్థానిక సీఐ రవిరాజు కోరారు.

మైనారిటీసెల్ అధ్యక్షుడిగా మహ్మద్‌అలీ


నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

పరకాల : మైనారిటీసెల్ పట్టణ అధ్యక్షుడిగా మహ్మద్ అలీని కొనసాగిస్తూ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మైనారిటీల సమస్యల పరిష్కారం, అభివృద్ధికి అలీ చేస్తున్న కృషిని గుర్తించి మరోసారి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ మేరకు నియామకపత్రం అందించారు. తన నియామకానికి కృషి చేసిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు అలీ కృతజ్ఞతలు తెలిపారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి


కుట్టు మిషన్ పంపిణీ చేస్తున్న సర్పంచ్

కమలాపూర్ : మహిళలు స్వయంఉపాధిని పొందుతూ ఆర్థికంగా ఎదగాలని సర్పంచ్ అంకతి సాంబయ్య అన్నారు. మండలంలోని గూడూరులో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (న్యాక్) ఆధ్వర్యంలో 28 మంది మహిళలకు 76 రోజుల పాటు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సంస్థ ఆధ్వర్యంలో శనివారం గ్రామ సర్పంచ్ అంకతి సాంబయ్య, పంచాయతీ కార్యదర్శి వినీల్ రెడ్డి చేతుల మీదుగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. న్యాక్ ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ ఇవ్వడం, శిక్షణ అనంతరం కుట్టు మిషన్లు అందజేయడం అభినందనీయమని, ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను మహిళలు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాక్ ఏడీ అశోక్‌రెడ్డి, సంస్థ ప్రతినిధి సంపత్, టైలరింగ్ ఇన్‌స్ట్రక్టర్ రాజకుమారి, మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ప్రకటనపై హర్షం



ఎల్కతుర్తి : గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ప్రొఫెసర్ కోదండరామ్ పేరును ప్రకటించడం హర్షనీయమని భీమదేవరపల్లి మండల జేఏసీ నాయకులు తెలిపారు. హైదరాబాద్‌లోని కోదండరామ్ నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేయనున్న ఆత్మీయ అభినందన సభకు మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌తో పాటు కోదండరామ్‌ను హాజరు కావాలని కోరినట్లు తెలిపారు. డాక్టర్ తిరుపతి, ప్రకాశ్, నాగరాజ్, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

1నుంచి సీఐటీయూ జాతీయ సభలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్: ఈనెల 31నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు హనుమకొండ ఫాతిమానగర్‌లోని బాలవికాస్‌లో నిర్వహించనున్న సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) జాతీయ వర్కింగ్ కమిటీ జాతీయ సభలను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు జాతీయ సమావేశాల పోస్టర్లను కాకతీయ యూనివర్సిటీలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీసవేతన చట్టం అమలుచేయాలని సూచించారు. బహిరంగ సభకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు, సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెట్టు రవి, ప్రభాకర్ రెడ్డి, బొట్ల చక్రపాణి, సారంగపాణి, పుల్ల అశోక్, రజిత తదితరులు పాల్గొన్నారు.

హన్మకొండ చౌరస్తా: కాజీపేట ఫాతిమాలోని బాలవికాసలో సీఐటీయూ సమావేశాలను నిర్వహించనున్నట్లు సీఐటీయూ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు సారంగపాణి తెలిపారు. ఈనెల 31వ తేదీన వేయిస్తంభాల గుడి నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం గార్డెన్‌లో సభను నిర్వహించనున్నట్లు వివరించారు. ఈమేరకు హనుమకొండ చౌరస్తాలోని జీవన్‌లాల్ కాంప్లెక్స్‌లో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

కేసు నమోదును ఖండిస్తున్నాం..

కాజీపేట అర్బన్: విధులు సక్రమంగా నిర్వర్తించిన వరంగల్ రూరల్ జిల్లా ఎక్సైజ్ డీటీఎఫ్ సీఐ రమేష్‌చందర్‌పై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎక్సైజ్ కానిస్టేబుల్స్ అండ్ హెడ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రబ్బానీ తెలిపారు. హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుడుంబా నిర్మూలనపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు నిర్వహించి, గుడుంబా నిర్మూలను కృషి చేస్తున్న అధికారిపై గీసుకొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం దారుణమని అన్నారు. సీఐపైనే కేసు నమోదైతే కింది స్థాయి ఉద్యోగుల మనోస్థైర్యం దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు. కేసును పారదర్శకంగా విచారణ చేపట్టి సీఐకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొల్లెపెల్లి రమేష్, వైస్ ప్రెసిడెంట్ ముత్యాల రమేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ రొయ్య రాజ్‌కుమార్, కోశాధికారి జక్కుల కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.